క్లుప్తంగా

సీటీవోను కలసిన వర్తక సంఘం అధ్యక్షుడు



సీటీవోకు పుష్పగుచ్ఛం ఇస్తున్న గోపాలకృష్ణంరాజు

మలికిపురం: అమలాపురం ఇన్‌కంట్యాక్స్ సీటీఓ కె.శ్రీలతను లక్కవరం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు, కెనరా బ్యాంకు లక్కవరం బ్రాంచ్ వ్యవస్థాపకుడు రుద్రరాజు గోపాలకృష్ణంరాజు మర్యాద పూర్వకంగా కలిశారు. మంగళవారం అమలాపురంలోని సీటీఓ కార్యాలయంలో ఈ మేరకు కలసి ఆమెకు పుష్పగుచ్ఛం అందించారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

మామిడికుదురు: నగరం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో స్థానిక బాలుర, బాలికల వసతి గృహాలకు చెందిన విద్యార్థులకు మంగళవారం ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి కె.స్వర్ణలత ఆధ్వర్యంలో బాలికల వసతి గృహానికి చెందిన 81, బాలురు వసతి గృహం విద్యార్థులు 78 వెరసి 159 మందికి వైద్య పరీక్షలు జరిపారు. వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌వీ కె.నిర్మల, హెల్త్ అసిస్టెంట్ కుడుపూడి శ్రీనివాస్, ఏఎన్‌ఎంలు కె.దుర్గాదేవి, ఎం.జయకుమారి, ఎంఎల్‌హెచ్‌పీలు ఓ.రోషిణి, కె.శిరీష, వార్డెన్‌లు పీవీఎస్ నాగవేణి, కె.ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఓటర్ డే ముగ్గుల పోటీలు

ఆలమూరు: మండలంలోని వివిధ పంచాయతీ కార్యాలయాల పరిధిలో మంగళవారం ముగ్గుల పోటీలు జరిగాయి. ఈనెల 25న జరగనున్న ఓటర్ డే పురస్కరించుకుని రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో మండలంలోని ఆయా పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొని ముగ్గులను వేశారు. ముగ్గుల పోటీల్లో అత్యుత్తమ ప్రతిభను కనబర్చిన వారికి బుధవారం అవార్డులు, బహుమతుల ప్రదానం జరగనుందని తహసీల్దార్ జి.లక్ష్మీపతి తెలిపారు. ఆలమూరులోని గాంధీ బొమ్మ సెంటర్‌లో నిర్వహించిన ముగ్గుల పోటీలను సర్పంచ్ నేలపూడి లావణ్య, ఉపసర్పంచ్ చల్లా సీతామహాలక్ష్మి, మత్స్యశాఖ అసిస్టెంట్ హెలీనా పరిశీలించి విజేతలను ఎంపిక చేశారు. పంచాయతీ కార్యదర్శి కె.సంజీవ్‌రెడ్డి, వీఆర్‌ఓ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ పొడిగింపుపై హర్షం



సాకా మణికుమారి

రావులపాలెం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోని రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌ను మరో పది సంవత్సరాలు పొడిగిస్తూ చట్టం తీసుకురావడం చాలా హర్షణీయమని ఉమ్మడి తూర్పుగోదావరి డీసీఎంఎస్ చైర్మన్ సాకా మణికుమారి అన్నారు. మంగళవారం ఈ మేరకు ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు వివిధ పథకాల్లో దామాషాకి మించి నిధులు ఖర్చు చేస్తుందని దీనివల్ల దళితులు మరో పది సంవత్సరాలు లబ్ధి పొందుతారన్నారు. సబ్‌ప్లాన్‌ను అమలు చేయడం లేదని ప్రతిపక్షాలు లేనిపోని తప్పుడు ప్రచారం చేస్తున్నాయని వీటిని నమ్మకుండా దళితులు తిప్పికొట్టాలని ఆమె కోరారు.

అంగన్‌వాడీలకు జీతాలు పెంచాలి

పి.గన్నవరం: అంగన్‌వాడీలకు కనీస వేతనంగా నెలకు రూ.26 వేలు ఇవ్వాలని కోరుతూ స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద పి.గన్నవరం ప్రాజక్టు పరిధిలో అంగన్‌వాడీలు మంగళవారం ధర్నా చేశారు. అంగన్‌వాడీలకు ఫేస్ యాప్ రద్దు చేయాలని, పర్యవేక్షణ పేరుతో వేధింపులను ఆపాలని, సంపూర్ణ పోషణ మెనూ చార్జీలు పెంచాలని, హెల్పర్ల ప్రమోషన్ల వయో పరిమితిని పెంచాలని నినాదాలు చేశారు. అనంతరం ఐసీడీఎస్ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకులు బండి వెంకటలక్ష్మి, కడలి నాగలక్ష్మి, జి.రాధ, అనంతలక్ష్మి, ఎ.బేబి తదితరులు పాల్గొన్నారు.

పదవి నుంచి టీడీపీ మండల శాఖ అధ్యక్షుడి తొలగింపు

పి.గన్నవరం: పార్టీ ప్రతిష్టకు భంగం కలిగించే విధంగా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న పి.గన్నవరం మండల టీడీపీ అధ్యక్షుడు తోలేటి సత్యనారాయణ మూర్తిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుని, అధ్యక్ష పదవి నుంచి తొలగిస్తున్నట్టు అమలాపురం పార్లమెంటు టీడీపీ సమన్వయకర్త బండారు సత్యనారాయణమూర్తి తెలిపారు. గ్రామ కమిటీల ఫిర్యాదులతో పాటు, పదే పదే హెచ్చరించినా అతని ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో రాష్ట్ర పార్టీ ఆదేశానుసారం తోలేటిపై చర్యలు తీసుకున్నట్టు బండారు వివరించారు.

ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధం

నేడు జాతీయ ఓటర్ల దినోత్సవం

కొత్తపేట: ప్రజాస్వామ్య దేశంలో పౌరులకు 'ఓటు'.. ఓ 'వజ్రాయుధం'. ప్రజాస్వామ్యంలో తమను తాము కాపాడుకునేందుకు, దేశ ప్రగతికి ఓటు ఓ మార్గదర్శకంగా ఉపయోగపడుతుంది. ప్రజాస్వామ్య విలువలకు తిలోదకాలిచ్చి, ఎన్నికల్లో నోటికొచ్చినట్టు ఎక్కడ లేని హామీలిచ్చి, ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబించి, అవినీతే ప్రధానంగా పనిచేసే ప్రభుత్వాల పతనానికి ఓటు ఓ 'ఆయుధం'లా ఉపయోగపడుతుంది. అందుకు 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదై భవిష్యత్‌లో ఆ వజ్రాయుధాన్ని సద్వినియోగం చేసుకునే దిశగా చైతన్యవంతులు కావాలి.

ఓటు నమోదు ఇలా చేసుకోవాలి

తహసీల్దార్ కార్యాలయాలు, వీఆర్వో, బూత్ స్థాయి అధికారుల వద్ద ఓటరు నమోదు ఫారాలు తీసుకుని వాటిని పూర్తి చేసిన అనంతరం ఆయా కార్యాలయాల్లో అందజేయాలి. నూతనంగా ఓటు హక్కు పొందే వారు ఫారం-6 కు జత చేసి ఇవ్వాలి. అలాగే ఓటు తొలగింపు, అభ్యంతరాలకు ఫారం-7, మార్పులు, చేర్పులకు ఫారం-8, ఒకే నియోజకవర్గంలో పోలింగ్ కేంద్రం మార్పునకు ఫారం-8ఎ లను తీసుకుని పూర్తిచేసి ఇవ్వాలి. 47 నెంబర్ కొత్తపేట నియోజకవర్గంలో 4 మండలాలు, 57 గ్రామాలు, 262 పోలింగ్ బూత్‌లు కాగా మొత్తం 2,48,993 మంది ఓటర్లు ఉన్నారు.

ఏటా జనవరి 25న..

ఓటర్లను చైతన్యవంతులను చేసేందుకు ఎలక్షన్ కమిషన్ ఏటా జనవరి 25న జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహిస్తోంది. ఓటర్లలో చైతన్యం కల్పించేందుకు నియోజకవర్గ ఎన్నికల, ఓటరు నమోదు అధికారులు, సహాయ అధికారులు (తహసీల్దార్లు) ఆధ్వర్యంలో జిల్లా, నియోజకవర్గ, మండల, బూత్ స్థాయిల్లో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. దానిలో భాగంగా వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్ వంటి పోటీలు నిర్వహించారు.

నేడు ప్రత్యేక కార్యక్రమాలు

జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం నియోజకవర్గ కేంద్రం కొత్తపేటలో తహసీల్దార్ కార్యాలయం నుంచి ఓటర్లు, యువత, విద్యార్థులతో వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వరకూ ర్యాలీ, ఓటర్లతో ప్రతిజ్ఞ, ఆ ప్రాంగణంలో రంగవల్లుల పోటీలు అనంతరం బహిరంగ సభ, కొత్త ఓటర్లకు గుర్తింపు కార్డుల పంపిణీ, సీనియర్ ఓటర్లకు సత్కారం, తదుపరి వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నారు.



కొత్తపేటలో ఓటు హక్కు వినియోగించుకునేందుకు బారులు తీరిన ఓటర్లు (ఫైల్)

నియోజకవర్గాల వారీ ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	పీఎస్‌లు	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం
కొత్తపేట	262	1,24,086	1,24,899	8	2,48,993
పి.గన్నవరం	212	97,235	95,104	2	1,92,341
రాజోలు	205	94,127	95,653	2	1,89,782
మొత్తం	679	3,15,448	3,15,656	12	6,31,116

ఓటు విలువ అపారమైనది



ప్రజాస్వామ్యంలో ఓటుకు వున్న విలువ ఎంతో అపారమైనది. ప్రతి పౌరుడూ తన ఓటుతో దేశాభ్యున్నతి సాధించడానికి దోహదపడాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ ఓటును అమ్ముకోకూడదు. ప్రతి ఓటరూ విధిగా ఓటు వేయాలి. దేశంపై తన నిబద్ధతను నిజాయితీగా ఓటు వేయడం ద్వారా నిరూపించుకోవాలి.

– ఎం.ముక్కంటి, ఆర్డీవో, కొత్తపేట

దేశ భవిష్యత్ నిర్ణేత ఓటరే..



దేశ భవిష్యత్‌ను నిర్దేశించేది ఓటరే. రాజ్యాంగం ప్రసాదించిన ఓటు హక్కుతో మంచి పరిపాలనాదక్షులను ఎన్నుకుని సత్పరిపాలన సముపార్జించుకోగల శక్తిమంతుడు ఓటరు. దేశాభివృద్ధికి తోడ్పడే నిర్ణేత ఓటరు. కనుక ప్రతి ఓటరు నిజాయితీగా, నిష్పక్షపాతంగా ఓటును వినియోగించుకోవడం ద్వారా మంచి పరిపాలనాదక్షులను ఎన్నుకోవాలి.

– జీడీ కిశోర్‌బాబు, తహసీల్దార్, కొత్తపేట

విఘ్నేశ్వరుని సన్నిధిలో ఎంపీ పూజలు



విఘ్నేశ్వరుని సన్నిధిలో ఎంపీ చింతా అనురాధ తదితరులు

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరస్వామిని అమలాపురం ఎంపీ చింతా అనురాధ మంగళవారం దర్శించారు. ఆమెకు ఆలయ ప్రధానార్చకుడు మాచరి వినాయకరావు, ఆలయ సిబ్బంది ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆమెను వేదపండితులు వేదమంత్రాల ఆశీర్వదించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. ఆమె వెంట ఆలయ చైర్మన్ నంబూరి వెంకటరమణరాజు, జెడ్పీటీసీ సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

ఘనంగా నీలకంఠేశ్వర స్వామి కల్యాణం

సఖినేటిపల్లి: అంతర్వేది కొలువైన పార్వతీ సమేత నీలకంఠేశ్వరస్వామి వారి ఆలయంలో మంగళవారం రాత్రి స్వామి, అమ్మవార్ల కల్యాణం కనుల పండువగా అర్చకులు నిర్వహించారు. అంతకు ముందు గ్రామ పురవీధుల్లో నంది వాహనంపై స్వామివారి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. మోరికి చెందిన చింతా నరసింహరావు స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించారు.

కష్టపడేవారికి చిరస్థాయి గుర్తింపు

అంబాజీపేట: విధి నిర్వహణలో భాగంగా ప్రజల కోసం కష్టపడి పనిచేసేవారే ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలుస్తారని డిప్యూటీ కలెక్టర్ ఏబీవీఎస్‌బీ శ్రీనివాస్, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మిలు అన్నారు. అంబాజీపేట తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తూ డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి పొంది ఎటపాక వెళుతున్న ఎల్.జోసఫ్‌ను మంగళవారం రెవెన్యూ అధికారులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు సేవలందించి, వారికి అండగా నిలిచిన జోసఫ్ సేవలు మరువలేనివన్నారు. జోసఫ్ దంపతులను రెవెన్యూ సిబ్బంది, వీఆర్వోలు, వీఆర్ఏలు, సచివాలయ సిబ్బంది, అధికారులు, గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు ఘనంగా సత్కరించారు. వీఆర్వో వక్కలంక నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీడీఓ ఐవీ రత్నంరాజు, సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాగవరపు నాగరాజు, వాసంశెట్టి పెదబాబు, సూదాబత్తుల రాము, రాయుడు కృష్ణమహేష్ తదితరులు పాల్గొన్నారు.



అంబాజీపేటలో తహసీల్దార్ కుటుంబ సభ్యులను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, సిబ్బంది

ఘనంగా బాలికల దినోత్సవం



బడుగువానిలంకలో మానవహారంగా ఏర్పడిన విద్యార్థినులు



మామిడికుదురులో సేవ్ గరల్స్ నినాదంతో ఆకట్టుకున్న విద్యార్థినులు

ఆలమూరు/మామిడికుదురు/రాజోలు/మలికిపురం/కొత్తపేట/ఆత్రేయపురం: పలు నియోజకవర్గాల్లోని వివిధ గ్రామాల్లో మంగళవారం జాతీయ బాలికల సంరక్షణ దినోత్సవం ఘనంగా జరిగింది. ఆయా పాఠశాలల్లోని ఉపాధ్యాయులు, విద్యార్థినులు బాలికల ఆవశ్యకతను వివరిస్తూ భారీ ర్యాలీలు నిర్వహించి మానవహారంగా ఏర్పడ్డారు. భావిభారత భవిష్యత్తు బాలికల చేతుల్లో ఉందని, బాలికల సంరక్షణలోనే భారతదేశం వెలుగొందాలని వారు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా బాలికలను వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అలాగే కొత్తపేటలో వినూత్నంగా బాలికల దినోత్సవం రోజున జన్మించిన ఇద్దరు ఆడబిడ్డల తల్లిదండ్రులకు శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో చెరో రూ.2 వేలు చొప్పున అందించారు. కార్యక్రమంలో శెట్టిబలిజ సంఘం అధ్యక్షుడు బొక్కా ప్రసాద్, గౌరవాధ్యక్షుడు యనమదల శ్రీనివాస్, ఖండ్రిగ ఉపసర్పంచ్ కడలి పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

భూములపై ఆర్డీవో సమీక్ష

సఖినేటిపల్లి: మండలంలో టేకిశెట్టిపాలెం ఎత్తు వంతెన మీదుగా వెళుతున్న నేషనల్ హైవే రోడ్‌కు సంబంధించి చేసిన సర్వేలోకి వచ్చిన రైతుల భూములు, ఆయా సర్వే నంబర్ల వారీగా మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అమలాపురం ఆర్డీవో వసంతరాయుడు, ప్రజాప్రతినిధులు, అధికారుల సమక్షంలో సమీక్షించారు. రైతుల పేర్లు, సర్వే నంబర్లు సక్రమంగా ఉన్నాయో, లేదో చూసుకోవాలని ఆర్డీవో రైతులకు సూచించారు. టేకిశెట్టిపాలెం, అంతర్వేదిపాలెం, రామేశ్వరం గ్రామాల పరిధిలో పలువురు రైతులు భూములు ఎన్‌హెచ్ రోడ్ మ్యాప్ పరిధిలోకి వచ్చినట్టు తహసీల్దార్ వై.రామకుమారి అన్నారు. ప్రభుత్వం ఇచ్చే నష్టపరిహారం పెంచి న్యాయం చేయాలని పలువురు రైతులు ఆర్డీవో దృష్టికి తీసుకు వెళ్లారు. అలాగే అయా గ్రామాల్లో రైతులు లేని సమయాల్లో చేసిన సర్వేను తిరిగి సర్వే చేయించాలని కూడా రైతులు విజ్ఞప్తి చేశారు. రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు, బొంతు రాజేశ్వరరావు, జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ, ఎంపీపీ వీరా మల్లిబాబు, ఎంపీటీసీ మందపాటి రత్నం, సర్పంచ్ నల్లి లీలావతి, కుసుమ చంద్రశేఖర్, మంగళంపల్లి బులిబాబు, పలువురు రైతులు పాల్గొన్నారు. అలాగే అంతర్వేదిలో లక్ష్మీనృసింహుని తీర్థోత్సవాల గురించి ఆర్డీవో మండల స్థాయి అధికారులతో సమీక్షించారు.



తహసీల్దార్ కార్యాలయంలో భూములపై సమీక్ష చేస్తున్న ఆర్డీవో, చిత్రంలో ఎమ్మెల్యే రాపాక

సంక్షేమ పథకాలతో పేదల జీవితాల్లో వెలుగు

- ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి
- జొన్నాడతో గడపగడపకూ..

ఆలమూరు: అభివృద్ధి, సంక్షేమం పథకాల అమలే లక్ష్యంగా ప్రభుత్వం పరిపాలన సాగిస్తూ బడుగు, బలహీన, పేద వర్గాల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మండలంలోని జొన్నాడ-1 సచివాలయ పరిధిలో మంగళవారం పార్టీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు, సర్పంచ్ కట్టా శ్రీనివాసు, ఉపసర్పంచ్ నాంద్ర నాగమోహన్‌రెడ్డి, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ ద్వారంపూడి నాగేంద్ర సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో మూడో విడత నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి గ్రామస్తులు అడుగడుగునా అపూర్వ స్వాగతం పలికారు. ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రజలు అడిగిన సమస్యలను పరిష్కరిస్తూ ముందుకు సాగారు. అహర్నిశలు ప్రజాభ్యుదయమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న సీఎం జగన్‌ను రాబోయే ఎన్నికల్లో ఆశీర్వదించాలని ఆయన కోరారు. రాష్ట్ర ప్రభుత్వం గడచిన మూడేళ్లలో పేద, బడుగు, బలహీన వర్గాలు, మైనారిటీల అభ్యున్నతికి నవరత్నాలతో పాటు అదనంగా అమలు చేస్తున్న 22 సంక్షేమ పథకాల ద్వారా గ్రామానికి రూ.20.40 కోట్లు అందించినట్లు ఎమ్మెల్యే జగ్గిరెడ్డి పేర్కొన్నారు. అలాగే ప్రతి నెలా 886 మంది పింఛన్‌దారులకు రూ.25.42 లక్షలను అందజేస్తున్నామన్నారు. పార్టీ రాష్ట్ర సేవాదళ్ సంయుక్త కార్యదర్శి చల్లా ప్రభాకరరావు, ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి, ఏజీపీ నామాల శ్రీనివాసు, పీఏసీఎస్ చైర్మన్లు నెక్కంటి వెంకట్రాయుడు, తాడి మెహెర్ ఆదిత్య రెడ్డి, నల్లి రాజు, మోటుపల్లి వెంకన్న, వైస్ ఎంపీపీ నేలపూడి రత్నకుమారి, సర్పంచ్‌లు గుణ్ణం రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



జొన్నాడలో మహిళకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి

ప్రజా సమస్యల పరిష్కారానికే గడప గడపకూ: ఎమ్మెల్యే రాపాక

మలికిపురం: ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం రూపొందించి అమలు చేస్తున్నారని రాజోలు ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు అన్నారు. మంగళవారం మండలంలోని బట్టేలంకలో రెండో రోజు గడప గపడకూ కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే ప్రజల సమస్యలతో పాటు, ప్రభుత్వం పరంగా వారి అవసరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయా లబ్ధిదారులతో మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి అందిన పథకాల వివరాలను ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ హయాంలో ప్రజల వద్దకే పరిపాలన సాగుతుందని రాష్ట్రంలో అర్హత కలిగిన ప్రతి కుటుంబానికీ ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాలను అందించాలన్నదే సీఎం జగన్ లక్ష్యమన్నారు. మనం చేసింది ప్రజలకు చెప్పమని సీఎం జగన్ ఎమ్మెల్యేలను ప్రజల వద్దకు పంపుతున్నారని ఆయన అన్నారు. రాష్ట్రంలో పెరిగిన జనాభాకు అనుగుణంగా గ్రామాలు, కాలనీల్లో మౌలిక వసతుల కల్పన కూడా జరగాలని భావించిన సీఎం ఆ దిశగా ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు. నియోజకవర్గంలో త్వరలో ఇళ్ల నిర్మాణం ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ నాయకులు గుబ్బల కనకదుర్గ, బోనం సురేష్, సొసైటీ చైర్మన్‌లు పెమ్మాడి సోమరాజు, ముప్పర్తి త్రిమూర్తులు, యెనుముల నారాయణస్వామి, నాయకులు పైడిపర్తి రామారావు, పంచాయతీ కార్యదర్శి ఇంజేటి శుభాకర్, వీఆర్వో మన్నె నాగబాబు, వెల్ఫేర్ అసిస్టెంట్ జి.హేమ నాగవేణి, రొక్కాల వెంకట్, కొల్లాబత్తుల అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



బట్టేలంకలో మహిళకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

మంచి ఫలితాలకు దోహదం

సఖినేటిపల్లి: ప్రభుత్వం పంపిణీ చేస్తున్న స్టడీ మెటీరియల్ ద్వారా విద్యార్థులు రాబోయే పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. మంగళవారం అంతర్వేదిపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో మండల స్థాయిలో వివిధ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు జగనన్న విద్యాభారతి కార్యక్రమం ద్వారా స్టడీమెటీరియల్‌ను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఎంఈవో నల్లి మనోహరం, హెచ్‌ఎం డి.జగదీప్‌కుమార్, ఎంపీపీ వీరా మల్లిబాబు, జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ, ఎంపీడీవో జి.భీమారావు, సర్పంచ్‌లు నల్లి లీలావతి, కట్టా ఉమామహేశ్వరరావు, ఎంపీటీసీ మందపాటి రత్నం, మండల పార్టీ అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్, నాయకులు ఈద రవిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేట: ఉన్నత చదువులకు, పోటీ పరీక్షల అన్నింటికి పదో తరగతి ఎంతో కీలకమని జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. అంబాజీపేట, తొండవరం, ఇసుకపూడి, చిరతపూడి జెడ్పీ హైస్కూళ్లలో విద్యాభారతి స్టడీ మెటీరియల్‌ను ఎంఈఓ డి.కిస్టఫర్ కర్నోలియస్, ఎంపీడీఓ ఐ.రత్నంరాజుల ఆధ్వర్యంలో మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ, జెడ్పీటీసీలు మాట్లాడుతూ ప్రభుత్వం పంపిణీ చేసిన ఉచిత స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని శ్రద్ధగా చదువుకోవాలన్నారు. అంబాజీపేటలో 130, తొండవరంలో 73, ఇసుకపూడిలో 30, చిరతపూడిలో 20 మంది విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, వైస్ ఎంపీపీ నేతల నాగరాజు, ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు ముత్తాబత్తుల ప్రశాంత్, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ నాగవరపు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అయినవిల్లి: మండలంలోని కె.జగన్నాథపురం, విలస, మాగాం జెడ్పీ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు స్థానిక జెడ్పీటీసీ సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావు చేతుల మీదుగా మంగళవారం జగనన్న విద్యాభారతి స్టడీ మెటీయల్ పంపిణీ చేశారు. 125 మంది విద్యార్థులకు ఈ మెటీరియల్‌ను ఆయన అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ తాడి వెంకటాచార్య, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట: పదో తరగతి విద్యార్థులందరూ 'జగనన్న విద్యాభారతి' స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎంపీపీ మార్గన గంగాధరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు గూడపాటి రమాదేవి ఉద్బోధించారు. జిల్లా పరిషత్ ద్వారా మండలంలో పదో తరగతి విద్యార్థులకు సరఫరా చేసిన స్టడీ మెటీరియల్ మంగళవారం పంపిణీ చేశారు. స్థానిక ఎంపీపీ కార్యాలయంలోని శ్రీకృష్ణదేవరాయ సభా ప్రాంగణంలో జరిగిన సభకు ఎంపీపీ గంగాధరరావు అధ్యక్షత వహించగా జెడ్పీటీసీ సభ్యురాలు రమాదేవి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకుని అన్ని పాఠశాలలు నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. సభలో మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి లక్ష్మీపతిరావు, ఎంపీటీసీ సభ్యులు నేలపూడి భీమరాజు, దూళి సూరిబాబు, జీబీహెచ్‌ఎస్ పీఎంసీ చైర్మన్ బీర శ్రీనివాసరావు, మండల సేవాదళ్ కన్వీనర్ జీపీ, ఎంపీడీఓ ఈ.మహేశ్వరరావు, ఎంఈఓ మట్టపర్తి హరిప్రసాద్, మండలంలో ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

ఆత్రేయపురం: ప్రభుత్వ పాఠశాలలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించినట్లు జెడ్పీటీసీ బోణం సాయిబాబా అన్నారు. మంగళవారం స్థానిక మహాత్మాగాంధీ హైస్కూల్‌లో జెడ్పీ నిధులతో రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని పలు ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులందరికీ అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ కుండ అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.



అంతర్వేదిపాలెంలో విద్యార్థులకు స్టడీ మెటీరియల్ ఇస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

సంక్షిప్తంగా..

పంట నమోదు తప్పనిసరి

ఆలమూరు: వరిసాగు చేసే రైతులు తప్పనిసరిగా పంట నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎస్.లక్ష్మీలావణ్య అన్నారు. ఆలమూరు, పెనికేరు, పెదపళ్ల తదితర గ్రామాల్లో మంగళవారం ఆమె పర్యటించి రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ ఏడాది రబీలో సుమారు 9750 ఎకరాలు సాగు చేయగా ఇప్పటివరకూ కేవలం 5200 ఎకరాలకు మాత్రమే పంట నమోదు పూర్తయిందన్నారు. మిగిలిన రైతులు కూడా సత్వరమే పంట నమోదు చేయించుకుని ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను, సరైన గిట్టుబాటు ధరను వర్తింపజేసుకోవాలన్నారు. అలాగే ఆధార్, పట్టాదారు పాస్‌బుక్ పత్రాలను సమీప రైతు భరోసా కేంద్రాలకు తీసుకువెళ్లి ఈ-కేవైసీ చేయించుకోవాలన్నారు. మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లోను, సొసైటీల వద్ద, ప్రైవేటు డీలర్ల వద్ద ఎరువుల నిల్వలు పుష్కలంగా ఉన్నాయన్నారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ తగదంటూ ధర్నా

కొత్తపేట: ఎందరో ప్రాణ త్యాగాల ఫలితంగా ఏర్పడిన విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ నుంచి పరిరక్షించుకునేందుకు ఉద్యమాన్ని తీవ్రతరం చేయవలసిన సమయం ఆసన్నమైందని రాష్ట్ర సీపీఐ కార్యవర్గ సభ్యుడు దేగా ప్రభాకరరెడ్డి పిలుపునిచ్చారు. విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వ రంగ సంస్థగానే కొనసాగించాలని దశల వారీ ఉద్యమంలో భాగంగా మంగళవారం స్థానిక ఆర్‌డీఓ కార్యాలయం వద్ద సీపీఐ-ఏఐటీయూసీ సంయుక్త ఆధ్వర్యంలో ఒకరోజు నిరాహార దీక్ష చేపట్టారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ తగదంటూ చేపట్టిన ఉద్యమంలో భాగంగా నేడు ఆర్‌డీఓ కార్యాలయాల వద్ద, బుధవారం కలెక్టరేట్‌ల వద్ద నిరాహార దీక్షలు, 31న విశాఖ స్టీల్ ప్లాంట్ వద్ద లక్షమందితో ఆందోళన చేపడుతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ మండల శాఖ కార్యదర్శి మోకా హేమ, జిల్లా, మండల శాఖల ప్రతినిధులు వి.శ్యామ్, కర్రి రామిరెడ్డి, కె.శ్యామ్, ఏఎస్‌ఎఫ్ జిల్లా కన్వీనర్ జి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యంపై కేసు

పి.గన్నవరం: సంక్రాంతి పండగకు అమ్మమ్మ ఇంటికి వచ్చిన ఒక యువకుడు అదృశ్యమైన సంఘటనపై పి.గన్నవరం ఎస్సై పి.గంగాభవాని మంగళవారం కేసు నమోదు చేశారు. పశ్చిమగోదావరి జిల్లా ములపర్రుకి చెందిన కట్టాకుల అఖిల్ (20) సంక్రాంతి పండగకు రాజులపాలెంలోని అమ్మమ్మ ఇంటికి వచ్చాడు. ఈనెల 22న తిరిగి ములపర్రు వెళ్లేందుకు సిద్ధమైన అఖిల్‌ను మేనమామ నక్కా సుబ్రహ్మణ్యం పి.గన్నవరం సెంటర్లో బస్టాండ్ వద్ద దించి వెళ్లిపోయాడు. అయితే అఖిల్ ఇంటికి చేరుకోలేదు. ఎక్కడా అతడి ఆచూకీ లభించలేదు. దీంతో మేనమామ సుబ్రహ్మణ్యం ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

ఆత్రేయపురం: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలనే దృఢ సంకల్పంతో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అందిస్తున్న రుణాలు, పథకాలు మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో నాతిబుజ్జి, ఆత్రేయపురం ఎస్‌బీఐ మేనేజర్ ఎన్‌వీపీ సత్యకుమార్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని ఉచ్చిలిలో రాత్రి శిబిర్ సదస్సు ఏర్పాటు చేసి వ్యవసాయదారులు, స్వయం సహాయ సంఘాలకు అవగాహన కల్పించారు. స్టేట్ బ్యాంక్ ద్వారా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం డ్వాక్రా సంఘాలకు చెక్కును అందించారు. కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైద్య సేవలను విస్తృతం చేయాలి

ఆలమూరు: మండలంలోని పెదపళ్ల పీహెచ్‌సీ పరిధిలో ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య సేవలను విస్తృతం చేయడంతో పాటు ప్రసవాల సంఖ్యను పెంచాలని వైద్యాధికారి పి.భవానీశంకర్ అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో మంగళవారం వైద్యారోగ్య సిబ్బందికి సెక్టార్ సమావేశం జరిగింది. జనవరిలో సాధించిన ప్రగతిని అధికారులకు సిబ్బంది వివరించారు. అనంతరం సబ్‌సెంటర్ల వారీగా వైద్యులు రికార్డులను తనిఖీ చేసి పలు సూచనలు, సలహాలు అందజేశారు.

గ్రంథాలయాన్ని ఆధునీకరించాలి

కొత్తపేట: శిథిలావస్థకు చేరిన స్థానిక ఉప గ్రంథాలయ భవనాన్ని ఆధునీకరించాలని స్థానిక కోనసీమ అభివృద్ధి సాధన సమితి, రోటరీ క్లబ్ సభ్యులు, పాఠకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గ్రంథాలయాల వార్షిక తనిఖీల్లో మంగళవారం జిల్లా గ్రంథాలయ కార్యదర్శి సాయివరప్రసాద్ స్థానిక ఉప గ్రంథాలయాన్ని సందర్శించారు. అనంతరం సత్తిరాజు ఆదిత్యకిరణ్ ఆధ్వర్యంలో గ్రంథాలయాన్ని ఆధునీకరించాలని కోరుతూ సెక్రటరీ వరప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు.